ప్రజాశక్తి
మంగళవారం 21 మార్చి 2023
5
విజయనగరం



5 రోజులపాటు ఆధార్ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతిఒక్కరూ తమ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. దీనికోసం జిల్లాలో ఐదు రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలు, మండలాల్లో ఈ నెల 20,21, 27, 28,29 తేదీలలో ఐదు రోజులు ప్రత్యేకంగా ఆధార్ క్యాంప్ లను ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్నిప్రజలంతా వినియోగించుకొని తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. ఆధార్ స్పెషల్ డ్రైవ్ పై ఎంపిడిఒలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం తప్పనిసరిగా మహిళా పోలీస్ లేదా కార్యదర్శిని నియమించాలని, మండలంలో చురుకుగా పనిచేసే ఇద్దరు లేక ముగ్గురు వలంటీర్లను, డాక్యుమెంటేషన్ చేసేందుకు ఆధార్ క్యాంప్ లో నియమించాలని సూచించారు. ఒక్కొక్క ఆధార్ సెంటర్లో తప్పనిసరిగా రోజుకు 25-30 సర్వీస్ లు పూర్తి చేయాలని ఆదేశించారు.



జాతీయ రహదారిపై బైఠాయించిన అంగన్వాడీలు

నిర్బంధాలపై అంగన్వాడీల ఆగ్రహం

- జాతీయ రహదారి దిగ్బంధం
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ అరెస్టు
- సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటం : తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేసి నిర్బంధానికి పాల్పడడాన్ని వ్యతిరేకిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అరెస్టులు, గృహనిర్బంధాలను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా వందలాది మంది కార్యకర్తలు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు ధర్నా చేసినా అధికారులు రాకపోవడంతో కలెక్టర్ సమీపంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి తమ గోడు వినిపించేందుకు విజయవాడ వెళ్తుంటే ఇక్కడ వచ్చి భయ భ్రాంతులకు గురిచేసి అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు. అరెస్టులు, బెదిరింపులకు భయపడేది లేదని, తమ సమస్యలు పరిష్కారం చేసేవరకు ఉద్యమిస్తామని జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈనేపథ్యంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌ను పోలీసులు ఈడ్చుకుపోయి అరెస్టు చేశారు. అనంతరం పోలీసులు, అంగన్వాడీలకు మధ్య తోపులాట జరిగింది. భారీగా వాహనాలు నిలిచిపోవడంతో అంగన్వాడీలు ఆందోళనను విరమించారు. అంతకు ముందు కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్ అనసూయ, గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్ మాట్లాడారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధాలకు పాల్పడడం అన్యాయమని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలుచేయాలని, బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి : తమ్మినేని

అంగన్వాడీలపై ప్రభుత్వ దమనకాండను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ఖండించారు. చలో విజయవాడకు తరలివెళ్తున్న అంగన్వాడీలపై పోలీసులు ఉక్కుపాదం మోపి, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం సరికాదన్నారు. సిఐటియు పిలుపుమేరకు ఆందోళనకు వస్తున్న అంగన్వాడీ మహిళలను దౌర్జన్యంగా అరెస్టులు చేయడం శోచనీయమన్నారు. పెత్తందారులపై యుద్ధం అంటూ పేద మహిళ అంగన్వాడీలపై ప్రభుత్వం యుద్ధం చేస్తున్నదని విమర్శించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని, వారి. చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని కోరారు.



సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

లక్ష్యానికి మించి ఉపాధి

- కూలీలకు రూ.35 కోట్ల బకాయి
- కేంద్ర ప్రభుత్వ విధానాలతో తగ్గిన కూలి

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు లక్ష్యానికి మించి జరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో (ఈనెల ఆఖరులోగా) 1.75లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఫిబ్రవరి నెలాఖరు నాటికే 1.84కోట్ల పనిదినాలు చేపట్టారు. మరోవైపు గతంతో పోలిస్తే పనిభారం పెరిగింది. అందుకు తగ్గట్టు కూలి మాత్రం పెరగలేదు. మార్చిలో చేపట్టిన పనులకు సంబంధించి కూలీలకు సుమారు రూ.35కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయకపోవడంతో కూలీలు ఎదురు చూస్తున్నారు.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో 3.51లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతి జాబ్‌కార్డుపైనా ఏడాదికి వంద రోజులు పని గ్యారెంటీగా కల్పిస్తున్న విషయం విధితమే. ఈ ఏడాది జిల్లాలో 1 కోటీ 45లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జనవరి 4 నాటికి 1కోటీ 41లక్షల పనిదినాలు కల్పించారు. 2,053 జాబ్‌కార్డులపై అప్పటికే వంద రోజుల పనిదినాలు పూర్తయ్యాయి. 34,948మంది 81నుంచి 99రోజులు ఉపయోగించుకున్నారు. అప్పటి వరకు చేసిన పనులపై రూ.283.17కోట్ల మేర కూలీలకు సమకూరింది. ఈనేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లాకు మరో లక్ష్యంలో 30లక్షల పనిదినాలు పెంచుకోవాలని సూచించింది. ఈ లక్ష్యాన్ని కూడా అధిగమించే దిశగా జిల్లాలో డ్వామా అధికారులు కసరత్తు చేయడంతో రెండు దఫాలుగా విధించిన లక్ష్యాన్ని మించి పనులు చేపట్టగలిగారు. ఫిబ్రవరి వరకు చేపట్టిన 1.84కోట్ల పనిదినాల (105శాతం పనిదినాలు)పై రూ.354కోట్ల మేర కూలీల వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యాయి. ఫిబ్రవరి 20 నుంచి మార్చి 20వరకు కూలీలకు రావాల్సిన బకాయి సుమారు రూ.35కోట్ల మేర ఉంటుందని అంచనా. ఈనేపథ్యంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులు కూడా జిల్లాకు పెరగనున్నాయి. ఉపాధి హామీ కూలీలకు అందిన మొత్తంపై 60శాతం మెటీరియల్ కాంపొనెంట్ నిధులు మంజూరవుతాయి. ఈఏడాది ఇప్పటి వరకు మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రూ.254కోట్ల మేర జనరేట్ అవుతాయి. పనిదినాలు ఇదే లెక్కన జరిగితే మార్చి 31 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కాంపొనెంట్ నిధులు రూ.316కోట్లకు చేరే అవకాశం ఉంది. వీటిని భవనాలు, రోడ్ల తదితర మౌలిక సదుపాయాలకు వినియోగించుకునేందుకు అవకాశం కలిగింది. కేంద్రం ప్రభుత్వ విధానాల ఫలితంగా గతంతో పోలిస్తే కూలీల శ్రమ పెరిగింది. అందుకు తగ్గ ఫలితం దక్కడం లేదు. గత ఏడాది ఒక్కపూట కష్టపడితే సగటు పని దినానికి రూ.250 నుంచి రూ.257 వరకు అందేది. ఈ ఏడాది రెండు పూటలా పనిచేయాలని మెలిక పెట్టింది. ఈ ఏడాది సగటు కూలి రేటు రూ.206 మించి రావడం లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్డుదారులందరికీ ఉపాధి పని



అడిగిన ప్రతి కూలీకీ పని కల్పించాం. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు, వర్షాల కారణంగా పనులు కొంత మందకొడిగా సాగినప్పటికీ, ఆ తరువాత ఊపందుకున్నాయి. ఎక్కువమంది జాబ్‌కార్డుదారులు పనులు ఉపయోగించుకుంటున్నారు. ప్రతి జాబ్‌కార్డు దారునికి వంద రోజులు పని కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాము. ఉపాధి పనులు కూలీల జీవనానికి ఎంతో తోడ్పాటు నందిస్తున్నాయి. దీనికితోడు ఖచ్చితమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. దీనివల్ల లక్ష్యానికి అనుగుణంగా పనిదినాలు కల్పించ గలుగుతున్నాం.

\- జి.ఉమాపరమేశ్వరి
డ్వామా పీడీ

రణరంగం

తాడివాని పాలెంలో నిర్మాణాలు కూల్చివేత



కూల్చేసిన ఇంటి పునాదులు

ప్రాంతం... కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం పరిధిలోని తాడివాని పాలెం. సమయం... సోమవారం ఉదయం 9 గంటలు. అప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న ఆ ప్రాంతంలో అలజడి మొదలైంది. కొద్దినిమిషాల్లోనే కొంతమంది గ్రామస్తులు, గూండాలు.. సుమారు 200 మందికి పైగా గునపాలు, కత్తులు, కర్రలతో రణరంగం సృష్టించారు. మూణ్నాలుగు గంటలపాటు బీభత్సం సృష్టించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సైతం ఏమీ చేయలేక చేతులెత్తేశారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండలంలోని దేశపాత్రునిపాలెం పంచాయతీ పరిధిలో తాడివానిపాలెం గ్రామ సమీపంలో గతంలో సాయిరాం కాస్టింగ్ కంపెనీ ఉండేది. ఆ పరిశ్రమ మూతపడ్డాక స్థలాన్ని విక్రయించడంతో ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు కొనుగోలు చేశారు. కానీ, ఆ భూమి తమదేనని తాడివానిపాలెం గ్రామస్తులు వాదిస్తున్నారు. దీనిపై తాడివానిపాలెం గ్రామస్తులకు, భూములు కొనుగోలు చేసిన వారికి కొంతకాలంగా వివాదం సాగుతోంది. కోర్టులో కేసు నడుస్తోంది. ఆ ప్రాంతంలో స్థలాలను కొనుగోలు చేసిన వారు పునాదులు నిర్మించుకున్నారు. ఇంతలో సోమవారం ఉదయం 9 గంటల సమయంలో గ్రామస్తులతోపాటు కొంతమంది గూండాలు గునపాలు, కత్తులు, కర్రలతో అక్కడికి చేరుకున్నారు. అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి, రౌడీయిజం చెలాయించి, పునాదులను కూలదోసి చెల్లాచెదురు చేశారు. 40 ఏళ్ల క్రితం అమ్మిన భూమి తమదేనంటూ వాదించారు. గతంలో స్థలాలు కొనుక్కున్నవారు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. సిఐ బాలసూర్యారావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి చేయి దాటుతుందని తెలిసి అదనపు బలగాలను రప్పించారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. దాదాపు నాలుగు గంటలపాటు రణరంగం సృష్టించారు. ఒకానొక సమయంలో పోలీసులు జోక్యం చేసుకునేందుకు భయపడ్డారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అక్కడ కట్టిన మొత్తం పునాదులను కూలదోశారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. ఈ ఘటనలో 46 మందిపై కేసులు నమోదు చేసినట్లు సిఐ బాలసూర్యారావు తెలిపారు. ఈ స్థల వివాదంపై గతంలో పలుమార్లు కేసులు నమోదైనట్లు వెల్లడించారు.



పోలీసులతో వాగ్వివాదానికి దిగుతున్న మహిళలు

మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు రాగిజావ

నేడు ప్రారంభించనున్న సిఎం ● రామభద్రపురం విద్యార్థులతో ఆన్‌లైన్‌లో ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా మధ్యాహ్న భోజన పథకంలో రాగి జావను అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం అమరావతి నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభించనున్నారు. ఉదయం 10.45 గంటలకు ప్రారంభించిన అనంతరం జిల్లాలోని రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. సిఎం నేరుగా విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. 8, 9 తరగతుల విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజనంలో రాగిజావ అందించడం ద్వారా విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం లభించడంతోపాటు రక్తహీనత వంటి అనారోగ్యాలకు చెక్ పడినట్లు అవుతుంది. జిల్లా వ్యాప్తంగా 1,41,410 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కలగనుంది. విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు రామభద్రపురం జెడ్‌పి హైస్కూల్ లో ఏర్పాట్లు చేస్తున్నారు. డిఇఒ. లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ ఇఒ తిరుపతినాయుడు, సమాచార శాఖ సాంకేతిక అధికారులు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు నెల్లిమర్ల విద్యార్థిని

విజయనగరం : ఉత్తర ప్రదేశ్ లోని వారణాశిలో ఈనెల 22 నుంచి వరకు జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు నెల్లిమర్ల అంబేద్కర్ గురుకులంలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని ఎ. హారిక ఎంపికయ్యింది. మన రాష్ట్ర జట్టు తరపున ఈ హ్యాండ్ బాల్ పోటీల్లో హారిక ఆడనుంది. జాతీయ స్థాయిలో పోటీలకు హారిక ఎంపిక కావడం పట్ల గురుకులాల జిల్లా సమన్వయ అధికారి బి.చంద్రావతి, కళాశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, పీడీ వీరమని, పిఇటి. అప్పల నరసమ్మ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు.

స్పందనకు 149 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కు ప్రజల నుండి 149 వినతులు అందాయి. అత్యధికంగా రెవిన్యూ కు సంబంధించి 108 వినతులు, మిగిలినవి ఇతర శాఖల కు చెందినవి ఉన్నాయి. ముఖ్యంగా సదరం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, గృహాల కోసం విజ్ఞప్తులు వచ్చాయి. వినతులను జిల్లా కలెక్టరు ఎ. సూర్య కుమారి, జె.సి మయూర్ అశోక్, ఉప కలెక్టర్లు సుదర్శన దొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు. ప్రతి రోజు అధికారులు వారి లాగిన్ లో వినతులను చూడాలని, అర్జీ దారులకు నాణ్యమైన సమాధానాలను ఇవ్వాలని సూచించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఎం.దీపిక వినతులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, దిశా మహిళా స్టేషన్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు, సిఐలు జె.మురళి, జి.రాంబాబు, సిహెచ్.రుద్ర శేఖర్, ఎస్ఐలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగరపాలక సంస్థ- ప్రజారోగ్య విభాగం- నగర పరిధిలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, పెరటి మొక్కలు, మిద్దె తోటల పెంపకం, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల తయారి, మొదలగు వాటిలో ప్రతిభను కనబరచిన మహిళలకు 'ఉమెన్ ఐకాన్ లీడింగ్' స్వచ్ఛత 2023 పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమిషనరు ఆర్. శ్రీరాములు నాయుడు తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ, తడి, పొడి చెత్తలను సేకరణ, పొడి చెత్తను వినూత్న పద్ధతిలో వినియోగిండం, చెత్త నుంచి సంపద తయారీ వంటి వాటిలో కృషి చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు, మైక్రో ఎంటర్ప్రైజెస్, నాన్ గెజిటెడ్ ఆర్గనైజేషన్ తదితర విభాగాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 22వ తేదీలోగా నగరపాలక సంస్థ కార్యాలయం లోని మెప్మా విభాగంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి జూన్ 5న జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో అవార్డులను ప్రధానం చేయనున్నామని తెలిపారు.

నలుగురు విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సోమవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం లెక్కలు పరీక్ష లో నలుగురు విద్యార్థులు చూసి రాతకు పాల్పడడంతో డిబార్ చేసినట్లు ఆర్ఐఒ ఎం.సత్యన్నారాయణ తెలిపారు. విజయనగరం, కురుపాంలో ఒక్కొక్కరు, పూసపాటిరేగలో ఇద్దరు చూసి రాతకు పాల్పడ్డారని తెలిపారు. పరీక్షకు 28,660 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 26887 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 1773 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

దరఖాస్తును తిరస్కరిస్తే.. .కారణం చెప్పండి

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెలాఖరులోగా ప్రభుత్వ పథకాలను మంజూరు చేసి, గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకర్లు దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు గల కారణాలను లబ్ధిదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. వారం రోజుల్లో యుద్ధప్రాతిపదికన బ్యాంకులవద్ద ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి, ఆమోదించాలని స్పష్టం చేశారు. బ్యాంకుల వారీగా తిరస్కరించిన దరఖాస్తుల సంఖ్య, అందుకు కారణాలపై ఆరా తీశారు. కొన్ని బ్యాంకులు అధిక సంఖ్యలో దరఖాస్తులను తిరస్కరించడం, పెండింగ్‌లో పెట్టడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ దరఖాస్తును తిరస్కరించినా, అందుకు కారణాలను దరఖాస్తుదారునికి తెలియజేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు తిరస్కరించిన దరఖాస్తులను కూడా మరోసారి పునఃపరిశీలన చేయాలని సూచించారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ పథకాల మంజూరు, డిసెంబరు వరకు సాధించిన ప్రగతిపై శాఖలవారీగా సమీక్షించారు. ప్రతీ బ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాల మేరకు ఆయా పథకాలకు రుణాలను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు.కొన్ని బ్యాంకుల్లో మంజూరు చేసిన దరఖాస్తుల కంటే, తిరస్కరించినవే ఎక్కువగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఎంఇజిపి పథకం కింద స్థాపిస్తున్న యూనిట్లద్వారా ఎక్కువమందికి ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎల్‌డిఎం శ్రీనివాసరావు, నాబార్డు డిడిఎం నాగార్జున, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ బి.సుధాకరరావు, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ వైవి రమణ, మత్స్యశాఖాధికారి నిర్మలాకుమారి, ఉద్యానశాఖాధికారి జమదగ్ని, నైపుణ్యాభివద్ధి అధికారి గోవిందరావు, పరిశ్రమలశాఖ జిఎం పాపారావు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మంత్రికి వినతి అందిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ ఎలైన్మెంట్ మార్పుచేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబును సుజల స్రవంతి పోరాట కమిటీ నాయకులు, రైతులు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యాన కలిశారు. అలైన్మెంట్‌ను మార్చడం వల్ల రైతులకు భూ నష్టం తగ్గి, ప్రభుత్వ ఖర్చు తగ్గి, ప్రతి పాదిత ఆయకట్టుకు నీరందివచ్చునని తెలిపారు. స్పందించిన మంత్రి నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడి ఎలైన్మెంట్‌కుఅవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, రాష్ట్రనాయకులు జె.వెంకట సత్యనారాయణరాజు, పోరాట కమిటీ గౌరవ అధ్యక్షులు బొదంకి గౌరి నాయుడు , రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు జె. సుధారాణి, చల్లా పెంటయ్య తది తరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాల్సిందే

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

రామభద్రపురం మండలంలోని భూ కబ్జాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. భూ కబ్జాలపై ఎన్‌జిఒ హోంలో సోమవారం సిపిఎం, జనసేన ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు, పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం మాట్లాడారు. రామభద్రపురం మండలంలో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొండకెంగువలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్నారు. రామభద్రపురం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలున్న భూమికి రికార్డులు మార్చివేసి స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కొట్టక్కి వద్ద జాతీయ రహదారి పక్కన చెరువును అధికార పార్టీ నాయకులు కప్పేసి ఆక్రమించేస్తున్నారని తెలిపారు. నరసాపురం వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్నారు. బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఈ నెల 27న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టేందుకు రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. అప్పటికీ స్పందించకపోతే రామభద్రపురంలో రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎ. సురేష్, జనసేన నాయకులు మహేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ పాల్గొన్నారు.

గర్భిణులకు నాణ్యమైన ఆహారం

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం : అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న ఆహారం నాణ్యతగా ఉండాలని జెసి మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం స్పందన హాల్ వద్ద ఐసిడిఎస్ పోషన్ పక్వడాలో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించారు. పిల్లలకు, మహిళలకు అందించే పాల పేకెట్లను తనిఖీ చేసి, ఎక్సపైర్ తేదీ ని చూసి పాల ప్యాకెట్లను తీసుకోవాలని అన్నారు. పోర్టిఫైడ్ బియ్యాన్ని తనిఖీ చేసి నాణ్యత ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రాగులు, జొన్నలు తదితర చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ఆసక్తిగా తిలకించారు. ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు 15 రోజుల పాటు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ పౌష్టికాహారంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి జెసికు వివరించారు. కార్యక్రమాల్లో ఐసిడిఎస్‌తోపాటు డిఆర్‌డిఎ, మెప్మా,విద్య, వైద్యశాఖలు, గిరిజన, సాంఘిక సంక్షేమశాఖలతోపాటు సచివాలయ సిబ్బంది భాగస్వాములు కావాలని తెలిపారు. ఏప్రిల్ 3న ముగింపు సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్య బేబీ షో పోటీలు, బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ ప్రసన్న, సుపరువైజర్లు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెట్రోల్ బంకులపై జరుగుతున్న దౌర్జన్యాల పట్ల పోలీసు శాఖ తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా పెట్రోల్ బంకుల అసోసియేషన్ అధ్యక్షుడు జి.నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కణపాక యూత్ హాస్టల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎల్ఐసి బిల్డింగ్ ఎదురుగా ఉన్న బిపిసిఎల్ పెట్రోల్ బంకులోకి ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి పెట్రోల్ పోయించి నగదు ఇవ్వకుండా పారిపోతుండగా బంకు సిబ్బంది వారిని అడ్డుకోగా సిబ్బందిపై దాడి చేశారని తెలిపారు. ఫోన్ చేసి సమీపంలోని జొన్న గుడ్డి ప్రాంతం నుంచి మరి కొంత మందిని రప్పించి గలాటా సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై తాము స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేశారన్నారు. ఈ తరహా దౌర్జన్యకర సంఘటనలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్. నాగేంద్ర వర్మ, కేతల రోహిత్, జై బాబు వెంకటేష్ పాల్గొన్నారు.

చెత్త పన్ను రద్దు చేయాలని వినతి

విజయనగరం కోట : చెత్త మీద పనులు వెంటనే రద్దు చేయాలని కోరుతూ టిడిపి నాయకులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఇంటి పన్నులోనే డ్రైనేజ్, స్ట్రీట్ లైట్స్, రోడ్లు, గ్రంథాలయాలు ఇతర ఇతర పనులన్నీ కలిపే ఉంటాయని టిడిపి నాయకులు అన్నారు. చెత్త పన్నును ఇప్పుడు ఇంటి పన్నులో కలిపివేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పటికే ఇంటి పన్ను రూ.200 ఉంటే దానికి అదనంగా చెత్త పన్ను మరో రూ.200 కలిపేసి.. రూ.400 కట్టాలని చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్, టౌన్ కార్యదర్శి బంగారు బాబు, షేక్ బాషా, మహేష్, విజ్జపు ప్రసాద్, గంటా పోలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ వెల్లడించారు. సోమవారం వేపాడలో ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. గ్రామాల్లో ప్రధానంగా రైతులకు, విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఎన్‌ఆర్‌ఐగా ఉన్న తనను అందులో భాగంగానే టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పార్టీ తరుపున సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు పంపించారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పర్యటించి, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో సమావేశమై, పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ పెద్దల సమక్షంలో సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వచ్చే ఎన్నికల్లో యువతే కీలకమని, అందుకే వారిని చైతన్యం చేస్తున్నామని తెలిపారు. అహర్నిశలు శ్రమించి, వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెప్పారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా ముందుకుసాగాలని కోరారు.

22న రాజమన్నార్ ఆలయంలో ఉగాది వేడుకలు

విజయనగరం : ఈ ఏడాది శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం శ్రీమన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత ఏర్పాట్లపై డిఆర్‌ఒ ఎం.గణపతిరావు సోమవారం తన ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రజలు ఉగాది వేడుకలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. సమావేశంలో టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, డిపిఆర్‌ఒ రమేష్ పాల్గొన్నారు.



బిపి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని గొల్జాం గ్రామంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైసిపి సీనియర్ నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ, సర్పంచ్ సంతోషమ్మ సహకారంతో విశాఖ మహారాణిపేటలో ఉన్న అను న్యూరోకార్డియాక్ ఆస్పత్రికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి.పాల్ కిరణ్ ఆధ్వర్యాన సుమారు 150 మందికి తనిఖీలు నిర్వహించారు. గుండెనొప్పి, దడ, బిపి, గ్యాస్ ట్రబుల్, కళ్లు తిరగడం, ఎడమ చేయి లాగడం, పొట్ట, కిడ్నీ సమస్యలు, నిద్ర సరిగ్గా పట్టకపోవడం, మెదడు సమస్యలు వంటి వాటిపై పరీక్షలు చేశారు. పదిమందికి గుండెకి సంబంధించిన శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వీరికి తమ ఆస్పత్రిలో పరీక్షలు చేసి, శస్త్రచికిత్స చేయనున్నట్లు వైద్యులు కిరణ్ తెలిపారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్

గజపతినగరం : గజపతినగరం, మెంటాడలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పిఒ నాగమణి తెలిపారు. జనరల్ విభాగంలో గజపతినగరం మండలంలోని రంగాపురం, ముచ్చర్ల-2, భూదేవిపేట, మర్రివలస-2, మెంటాడ మండలంలో రెల్లిగూడెం, బుచ్చిరాజుపేట పోస్టులను భర్తీచేయనున్నట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత ధ్రువపత్రాలను మార్చి 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఐసిడిఎస్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

24న వాహనాల వేలం

శృంగవరపుకోట : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 24న వేలం వేయనున్నట్లు సిఐ ధర్మారావు తెలిపారు. 6 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని కోరారు.

నూతన ఎమ్మెల్సీలను కలిసిన కర్రోతు

భోగాపురం : నూతనంగా ఎన్నికైన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలను సోమవారం టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగారు రాజు కలసి పసుపు గుచ్చాలతో అభినందనలు తెలిపారు. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. భవిష్యత్తులో వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ట్రైలర్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అకిరి ప్రసాద్‌రావు, కర్రోతు సత్యనారాయణ, పిన్నింటి సన్యాసినాయుడు, సరగడ తోగులు రెడ్డి, మండల పృథ్వీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అడ్డగింత

బొబ్బిలిరూరల్ : మండలంలోని మెట్టవలస గ్రామంలో బాల్యవివాహాలను ఐసిడిఎస్ సిడిపిఒ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బొబ్బిలి పోలీసులు అడ్డుకొన్నారు. పిల్లల తల్లిదండ్రులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. సోమవారం గ్రామంలో మూడు బాల్యవివాహాలు చేసేందుకు ముహూర్తాలు తీసినట్లు తెలిసి వారం రోజుల నుంచి అంగన్‌వాడీ సిబ్బంది, ఎఎన్ఎం కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా వినకపోవడంతో సోమవారం ఎస్ఐ సిహెచ్.సత్యనారాయణ, ఎంపిడిఒ భాస్కరరావు, ఆర్ఐ కళ్యాణ్ వెళ్లి బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా ఎటువంటి చర్యలు తీసుకుంటారో వివరించారు. దీంతో వారు వెనక్కి తగ్గారు. బాల్యవివాహాలు చేయబోమని రాతపూర్వకంగా లేఖలు అందించారు.

బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ

లక్కవరపుకోట : లక్కవరపుకోట ఆదర్శ పాఠశాలలో సోమవారం నిర్వహించిన బాలికల రక్షణ కార్యక్రమంలో విద్యార్థినులు బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ధర్మకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలికల్లో చైతన్యాన్ని కలిగించేందుకు నాలుగు రోజుల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.

గురుకులం పిలుస్తోంది

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో 2023-24లో ఇంటర్, ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ యు.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఐదో తరగతిలో ప్రవేశించే వారు ప్రభుత్వ గుర్తింపబడిన పాఠశాలలో మూడో తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి మార్కులు ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు.

'సీతం' ప్రపంచ జల దినోత్సవం

విజయనగరం : 'సమస్త జీవజాలానికి ,చెట్టూ చేమకు ప్రాణావసరమైన నీటిని ప్రతి ఒక్కరూ ప్రాణప్రదంగా చూసుకోవాలని ఇండో అమెరికన్ వాటర్ సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ బి.రఘువీర పేర్కొన్నారు. స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య వక్తగా ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 60 కోట్ల మంది తీవ్ర నీటి ఎద్దడితో దురవస్థల పాలవుతున్నారని, 2030 నాటికి అందుబాటులోని నీటికంటే అవసరాలు రెండింతలు అధికం కానున్నాయని, ఈ నీటి కొరత ను నివారించడానికి ప్రతీ పౌరుడూ జల సంరక్షణ కోసం తమ వంతు తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ప్రాజెక్ట్ లో ఇటువంటి ప్రత్యామ్నాయ ప్రక్రియలపై కృషి చేయాలని ఆయన సూచించారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగాన్ని అభినందించారు. అనంతరం నీటిని సంరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యమ్రంలో కళాశాల ఉప ప్రధానాచార్యులు సిహెచ్. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మిల్లెట్స్ మహోత్సవం

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం 'అంతర్జాతీయ మిల్లెట్స్ మహోత్సవం' ఘనంగా నిర్వహించారు. మిల్లెట్స్‌తో తయారుచేసిన వంటకాలు పోటీని నిర్వహించారు. ఎంపిడిఒ వై.వద్దిజ, ఐసిడిఎస్ సిడిపిఒ హేమలత విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎపిఎంలు వెంకటరమణ (ఎఫ్‌పిఒ), శ్రీనివాసరావు, సిసిలు అప్పలస్వామి, ఈశ్వరరావు, సన్యాసి, ఆనందరావు పాల్గొన్నారు.

డెంకాడ : స్థానిక వెలుగు కార్యాలయంలో మిల్లెట్స్ (చిరుధాన్యాలు)తో తయారు చేసిన వంటకాలు పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. గెలిపొందిన విజేతలకు ఎంపిడిఒ డి. స్వరూపారాణి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఐదుగురు విజేతలను ఎంపిక చేసి వారిలో ముగ్గురును జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎపిఎం విజయలక్ష్మి, ఎఒ, సిసిలు సూరిబాబు, నర్సింగరావు, బి.సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

వంగర: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఎంపిపి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఓని అగ్రహారం, వివిలర్ పేట, అరసాడ మహిళలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు, తహశీల్దార్ డి ఐజక్, ఎపిఎంలు చక్రపాణి, గోవిందరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు కాంబోతుల భగవతి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వంటకాలను ప్రదర్శించారు. గెలిపొందిన విజేతలకు ఎంపిడిఒ జి. గిరిబాల, తహశీల్దార్ కె.వి.రమణ రాజు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎపిఎం సత్యనారాయణ, గురుమూర్తి, సిసిలు పాల్గొన్నారు.

రామభద్రపురం : చిరుధాన్యాల వంటకాలు ఆహారంలో తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపిడిఒ రమామణి తెలిపారు. వైకెపి వంటల పోటీలు నిర్వహించారు. మేజర్ పంచాయతీ ఇఒ సుప్రియ, ఎపిఒ కోట సుశీల పరిశీలించి, ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎపిఎం గాడి వెంకట రమణ, ఎఫ్‌పిఒ ఎపిఎం రత్నకుమార్, సిసిలు పాల్గొన్నారు.



వేపాడ.. విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపిడిఒ, తహశీల్దార్

వేపాడ : చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ తెలిపారు. మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద చిరుధాన్యాలతో వంటకాల తయారీ పోటీని నిర్వహించారు. విజేతలకు బహుమతులను ఎంపిడిఒ, తహశీల్దార్ కృష్ణంరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో ఎపిఒ సన్యాసినాయుడు, పశువైద్యులు నాయుడు, ఎపిఎం శ్రీనివాస్, సిసి కృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్ శారద, అకౌంటెంట్ పావని పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరంకోట

అసెంబ్లీలో టిడిపి నాయకులపై దాడి చేసిన వైసిపి ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లజెండాలతో నిరసన తెలిపారు. వైసిపి డౌన్ డౌన్, దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు , నాయకులు గంటా పోలినాయుడు, కనకల మురళీమోహన్, విజ్జపు ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి దళిత ఎమ్మెల్యే పై దాడి దుర్మార్గం

నెల్లిమర్ల : అసెంబ్లీ సాక్షిగా టిడిపి దళిత ఎమ్మెల్యే పై అధికార వైసిపి దాడి చేయడం దుర్మార్గమని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీలో టిడిపి సీనియర్ నాయకుడు కొండేపి ఎమ్మెల్యే డోలబాల వీరాంజనేయ స్వామి పై అధికార వైసిపి దాడి చేయడం దుర్మార్గమన్నారు. అధికార వైసిపి ఎమ్మెల్యేలను బర్త్ రఫ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌సి సెల్ నాయకులు కనిగిరి శ్రీనివాసరావు, టొంపల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే పై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వైసిపి ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి రేగాన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

డెంకాడ: అసెంబ్లీలో ప్రజాస్వామ్య విలువలు ఖూనీ చేస్తూ టిడిపి ఎమ్మెల్యేలపై వైసిపి ఎమ్మెల్యేలు దాడి చేయడం సిగ్గుచేటని టిడిపి మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. జగన్ పార్టీ రౌడీలకి అడ్డా అని మరోసారి రుజువైందన్నారు. స్పీకర్ పోడియం వద్ద తమ సమస్యలను వివరిస్తున్న దళిత ఎమ్మెల్యేలపై దాడి బాధాకరమన్నారు.

లెండిలో ఘనంగా ఉత్కర్ష్- 2023

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ స్టూడెంట్ అసోసియేషన్ వార్షికోత్సవం ఉత్కర్ష్ -2023 ఘనంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన జీ టెక్నో ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్ హ్యూమన్ రిసోర్సెస్ మేనేజర్ సావిత్రి ఘడియారామ్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. నేటి తరం అవసరాలకు కంప్యూటర్ సైన్స్ విభాగం నుండే పలు సేవలు అందించ బడుతున్నాయని అన్నారు. అందుకు ధీటుగా యువ ఇంజినీర్లు, కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని విషయాల్లో ముందుంటుందని, కంప్యూటర్ సైన్స్ స్టూడెంట్ అసోసియేషన్ ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. సంస్థ చైర్మన్ పి మధుసూదన రావు, ప్రసంగిస్తూ విద్యార్థులు విద్యాభ్యాసంతో బాటు మేనేజ్‌మెంట్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఐడియాథాన్, టెక్నికల్ క్విజ్, కోడ్ కన్వర్షన్, ట్రెజర్ హంట్, సిస్టమ్ అన్‌లాకింగ్ పోస్టర్ వంటి పలు పోటీలు నిర్వహించారు. ఈ



ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఆదిమళ్ళ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, ఎవి పరాంకుశం, ప్లేస్‌మెంట్ డీన్ జి. ప్రకాష్ బాబు, అన్ని విభాగాల అధిపతులు, డాక్టర్ రాజన్ బాబు, డాక్టర్ రామారావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ సుబ్బరామయ్య, డాక్టర్ సతీష్ పూజారి, డాక్టర్ దుర్గా శైలజ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

గజపతినగరం : అకాల వర్షాలతో నేలకొరిగిన మొక్కజొన్న పంటను సోమవారం వ్యవసాయ శాఖ ఎడి కె.మహారాజన్ పరిశీలించారు. సీతారాంపురం, పిడిశీల, కాళంరాజుపేట గ్రామాలలో 120 ఎకరాలు, బొండపల్లి మండలంలోని 50 ఎకరాల్లో పంట నష్టాన్ని అంచనా వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిటిఎం ఉదయశ్రీ, విఎఎ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో రాగిజావ

వేపాడ : మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం నుంచి రాగిజావను విద్యార్థులకు అందిస్తామని ఎంఇఒ శ్రీదేవి తెలిపారు. విద్యార్థులంతా ఇంటి నుంచే గ్లాసులు తెచ్చుకొనేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంత మంది విద్యార్థులకు పంపిణీ చేశారో వివరాలను ఎంఇఒ కార్యాలయానికి నివేదిక పంపించాలని ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ల చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు

ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రక్కులు, రూ. 4.50 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ట్రాక్టర్ల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఒక ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రాక్టర్ ట్రక్కులు, రూ. 4.50 లక్షల నగదును రికవరీ చేసినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. సోమవారం జిల్లా పోలీసుకార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ఎస్.కోట, ఎల్.కోట, జామి, డెంకాడ మరియు విజయనగరం రూరల్ పోలీసు స్టేషను పరిధిలో జరిగిన ట్రాక్టరు దొంగతనాలను దృష్టిలో పెట్టుకొని కేసుల మిస్టరీని చేధించేందుకు విజయనగరం ఇన్చార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిసిఎస్, జామి, ఎస్.కోట పోలీసులతో ప్రత్యేకంగా మూడు బృందాలను ఏర్పాటు చేసామన్నారు. ఈ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా విచారణ చేసి, అనుమానస్పద వ్యక్తులపై నిఘా పెట్టారన్నారు. జామి మండలంఅలమండ రైల్వే స్టేషను సమీపంలో అనుమానస్పదంగా సంచరిస్తున్న శ్రీకాకుళపు నాగరాజు (28)ను జామి పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారణ చేయగా, తనతో పాటు కొత్తవలస మండలం వియ్యంపేటకుచెందిన నాగులాపల్లి గణేష్ (18), మరో బాలుడి సాయంతో గ్రామాలకు దూరంగా ఉన్న వ్యవసాయ కళ్లాల్లో ఉన్న పాత్ర ట్రాక్టర్లను దొంగలించినట్లు అంగీకరించారు. నిందితులు ఇటుక బట్టీల్లో పని చేస్తూ, బట్టీ యజమానుల వద్ద నుండి అడ్వాన్సుగాడబ్బులు తీసుకొని, తిరిగి చెల్లించకపోవడంతో అప్పులబారిన పడ్డారన్నారు. ఈ అప్పుల నుండి బయట పడేందుకుగాను జామి మండలంలో ఒకటి, ఎస్.కోట మండలంలో రెండు, ఎల్. కోట మండలంలో ఒకటి, డెంకాడ మండలంలో ఒకటి



ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులను అభినందిస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

మరియు విజయనగరం మండలంలో మరొకటి మొత్తం ఆరు ట్రాక్టర్లును దొంగిలించినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడించారన్నారు. నిందితులను అరెస్టు చేసి ఒక ట్రాక్టరు ఇంజను, మూడు ట్రాక్టరు తొట్టెలు, ట్రాక్టర్లును స్క్రాప్ షాపులకు విక్రయించిన నగదులో రూ. 4.50 లక్షలను తిరిగి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు పాల్పడిన నేరాల్లో మరో ట్రాక్టరును కడపకు చెందిన బాలకృష్ణారెడ్డి నుంచి ఇంకా రికవరీ చేయాల్సి ఉందని జిల్లా ఎస్‌పి తెలిపారు. సమావేశంలో విజయనగరం డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ జి.రాంబాబు, ఎస్ఐలు జి.వీరబాబు, బి. సాగరబాబు, ప్రశాంతకుమార్, నజీమా బేగం పాల్గొన్నారు.

క్వారీ లారీ బోల్తా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని పాత అలుగుపల్లి గ్రామం వద్ద క్వారీల నుంచి పిక్కలోడుతో వెళ్తున్న లారీ ఆదివారం రాత్రి అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ మద్యం మత్తు కారణంగా లారీ బోల్తా పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడం వల్ల ప్రమాదం తప్పిందని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి రోజూ పరిమితికి మించి లోడుతో లారీలు వెళ్లడం వల్ల రోడ్లు పాడవడంతోపాటు దుమ్ము, ధూళి ఎగరడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.



బోల్తాపడిన క్వారీ లారీ

సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. సోమవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించి అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన 241.2 కిలోవాట్స్ పవర్ సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ 25 ఏళ్లపాటు ఈ ప్లాంట్ నిరాటంకంగా పనిచేస్తొందన్నారు. దీనిపై పెట్టిన పెట్టుబడి కేవలం నాలుగున్నరేళ్లలో వెనక్కి వస్తుందన్నారు. కేవలం నెల రోజుల్లోనే పవనసుత అనే ప్రైవేటు సంస్థ దీనిని నిర్మించిందన్నారు. సగటున ఏటా 3.18 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ కె.మాధవరావు, డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ సన్నీడియోల్, అనుదీప్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని డిఎంహెచ్‌ఒ రమణకుమారి కోరారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద సోమవారం ఓరల్ హైజిన్ (నోటి శుభ్రత గురించి) ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకుకి సంభందించిన సిగరెట్లు, గుట్కా, ఖైని, గుట్కా వల్ల నోటి కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇటువంటి అలవాట్లకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. ఆర్నెల్లకు ఒకసారి దంత వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అధిక కారం, మసాలా, ఘాటు పదార్థాలకు దూరంగా ఉండటం వల్ల ఇటువంటి సమస్యల నుండి రక్షించుకోవాలని తెలియజేశారు. శీతలపానీయం వినియోగం తగ్గించాలని, ఆహారం తిన్న వెంటేనే నోటిని పుక్కిలించుకోవాలని సూచించారు. తీపి పదార్థాలను వీలైనంత తక్కువ తీసుకోవాలన్నారు. రోజుకి రెండుసార్లు బ్రష్ చేయాలని, మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిడి పిఒ పి.రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఎన్.సూర్యనారాయణ, డెమో సెక్షన్ సభ్యులు వి.చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్స్ బాధితులకు అందజేత

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పోయిన మొబైల్స్ ను ట్రేస్ చేసేందుకు గత ఏడాది జిల్లా ఎస్పీ ప్రారంభించిన వెబ్ పోర్టల్‌కు, వాట్సాప్ నెంబరుకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు చర్యలు చేపట్టి రూ.13.83లక్షల విలువైన 80 స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి ఎం.దీపిక సోమవారం జిల్లాపోలీసు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. పోగొట్టుకున్న మొబైల్స్ గురించి పోలీసులకు సులువుగా ఫిర్యాదు చేసేందుకు జిల్లా పోలీసుశాఖ గత సంవత్సరంలో ప్రత్యేకంగా http://vzm-mobiletracker.in అనే ఒక వెబ్ పోర్టల్ ను, వాట్సాప్ నెంబరు 8977945606 ను ప్రారంభించిందన్నారు. వీటికి వచ్చిన ఫిర్యాదులు ఆధారంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మరో 80 స్మార్ట్ ఫోన్లును తిరిగి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో భాగంగా మన రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు పలు రాష్ట్రాల్లో ఉన్న వారు పోయిన మొబైల్స్ ను వినియోగిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. సైబరు సెల్ పోలీసులు మొబైల్స్ వినియోగిస్తున్న వారితో మాట్లాడి, ఆయా ప్రాంతాల నుండి వాటిని తిరిగి రికవరీ చేశారని తెలిపారు. మొబైల్స్ ను రికవరీ చేయడంలో శ్రమించిన సైబరు సెల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ కుమార్, కానిస్టేబుళ్ళు బి. వాసుదేవరావు, ఎం.శ్రీనివాసరావు, ఎన్. రాజేష్, టి.తిరుపతి నాయుడు లను ఎస్‌పి అభినందించారు. రికవరీ చేసిన 80 మొబైల్స్ ను బాధితులకు ఎస్‌పి అందజేశారు.

గుణుపూరుపేటలో 'చేయి చేయి కలుపుదాం'

డెంకాడ : మండలంలోని గుణుపూరుపేటలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు తెలుగు సూరిబాబు ఆధ్వర్యంలో హాత్‌సేహాత్ జోడో అభియాన్(చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమణ, అప్పల రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

వంగర : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వస్తున్న ఫిర్యాదులపై స్పందించాలని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కచ్చితంగా స్పందించాలన్నారు ఈ సమావేశంలో తహశీల్దార్ డి. ఐజక్ ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి లోపింటి త్రినాధరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో దరఖాస్తుల వెల్లువ

భోగాపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొట్టమొదటిసారిగా మండల స్థాయి స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపిడిఒ డి. బంగారయ్య తెలిపారు. అధికారులు, పంచాయితీ కార్యదర్శుల సమక్షంలో స్పందనా కార్యక్రమం ఏర్పాటు చేశామని దీనికి స్పందన లభించిందని చెప్పారు. ముంజేరులో కాలువ నిర్మాణాలు చేయాలని గ్రామస్తులు వినతి ఇచ్చారన్నారు. మొత్తం 20 వినతలు వచ్చాయని వీటిని ఆన్ లైన్‌లో పొందుపరిచి తదుపరి పరిష్కార నిమిత్తం సంభందిత శాఖలకు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రేగిడి : మండల, గ్రామ సచివాలయ పరిధిలో వచ్చిన స్పందన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు సూచించారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చిన సమస్యలపై ప్రతి అర్జీకి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. సమస్యను ఎన్ని రోజుల్లో పరిష్కరించాలో ఫిర్యాదు దారునికి తెలియజేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బయోమెట్రిక్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ టీ. కల్యాణ చక్రవర్తి, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ పాల్గొన్నారు.

జెఎన్‌టియులో జాతీయ వర్క్‌షాప్

విజయనగరం టౌన్ : స్థానిక జె ఎన్‌టియులో జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను సోమవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌కు రాయల్ సివిల్ అనే ప్రాముఖ్యత ఎల్లప్పుడూ ఉందన్నారు. సివిల్ ఇంజినీర్ల కు ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేసే అవకాశం ఉందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించు కావాలన్నారు. తరగతి గదిలో నేర్చుకున్న దానిని ప్రాక్టికల్స్ అమలు చేయాలన్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింపోజియం లో యూనివర్సిటీ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.